ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆర్‌డిఒ కార్యాలయంలో..

ఆ నోటిఫికేషన్ లేదట !

- సమాధానం దాటవేత
- అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణ పరిహారంపై వీడని గందరగోళం

అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి చెల్లించనున్న పరిహారం, పునరావాసంపై అధికారులకు స్పష్టత కొరవడింది. రోడ్డు విస్తరణ తప్ప బాధితుల పరిహార విషయం వారికి పట్టడంలేదు. పునరావాసం, పరిహారానికి సంబంధించిన నోటిఫికేషన్ కూడా ఆర్‌డిఒ కార్యాలయంలో లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. క్షణానికోమాట చెప్పి అధికారులు గందరగోళానికి గురి జేస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టం కింద నోటిపై చేసిన ప్రకారం పరిహారం, పునరావాసం చెల్లించాలని బాధితులు పట్టుబడుతున్నారు. టిడిఆర్ బాండ్లు తీసుకొనేదిలేదని వారు ముక్తకంఠంతో చెప్పడంతో 2013 భూ సేకరణ చట్టం కింద జారీచేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసినట్లు మునగపాకలో ట్రాన్సఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లపై జరిగిన అవగాహన కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయిషా చెప్పారు. అయితే, సమాచార హక్కు చట్టం కింద చేసిన దరఖాస్తుకు అందుకు భిన్నమైన విస్తుపోయిన సమాధానం ఆర్‌డిఒ కార్యాలయం నుంచి లభించింది. అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఏ చట్టం కింద పరిహారం, పునరావాసం చెల్లిస్తామని నోటిఫికేషన్ జారీచేశారని, జారీ చేసిన నోటిఫికేషన్ నకలు ఇప్పించాలని కోరితే... ఆ సమాచారం ఆర్‌డిఒ కార్యాలయంలో లభ్యంగా లేదని అక్కడివారు తెలిపారు. రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం చెల్లింపు నోటిఫికేషన్ ఆర్‌డిఒ కార్యాలయంలో లేకుండా గ్రామాల్లో టిడిఆర్‌లపై అవగాహన సదస్సులు ఆర్‌డిఒ ఎలా నిర్వహించారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వ ఒత్తిడితో చెప్పినట్లు చేయడమే తప్ప రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఎలా ఇవ్వాలనే స్పష్టత అధికారులకు లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది.

2013 భూ సేకరణ చట్టం కింద జారీచేసిన నోటిఫికేషన్ రద్దుకావడంతో టిడిఆర్ బాండ్లపై మిగతా 2లో..

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

ఘనంగా మేడే సాంస్కృతికోత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తలపెట్టిన మేడే సాంస్కృతికోత్సవాలు ఘనంగా సాగాయి. ఉత్సాహం, ఉత్తేజం, స్ఫూర్తి నింపాయి. తొలుత అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి జివిఎస్.రాజేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం లక్ష్యాన్ని తెలియజేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ హెడ్ ఎం.భాస్కరరావు మాట్లాడుతూ కళల ప్రాశస్త్యాన్ని వివరించారు. కళల్లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. కార్మికులకు తీరిక సమయం తగ్గిపోతున్న తరుణంలో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కళలను ప్రదర్శించే అవకాశం కల్పించిన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వాహకుల కృషిని అభినందించారు. విశాఖ బాలోత్సవం అధ్యక్షులు రఘు మాట్లాడుతూ ప్రముఖ నాయకుల సూక్తులను ఉటంకిస్తూ వారు చెప్పిన మార్గంలో పయనించేటట్లుగా కార్యక్రమాలు ఉండాలని ఆకాంక్షించారు. పిల్లల దృష్టిని పుస్తకాలవైపునకు మళ్లించాలన్నారు. ప్రసంగాల అనంతరం కళా ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఎల్ఐసి ఉద్యోగులు పూలే డ్యాన్స్ రూపకంతో ఆకట్టుకున్నారు. స్వర్ణ (కూచిపూడి), శివ (క్లాసికల్), బ్యాడ్ బాయ్స్ వంటి డాన్స్ అకాడమీలవారు నృత్య రూపకాలతో కట్టిపడేశారు. స్టీల్‌ప్లాంట్ మిగతా 2లో..

'సింహాచలం' మృతులకు ఎక్స్‌గ్రేషియా అందజేత

వార్త మెయిన్‌లో..

అకాల వర్షంతో అపార నష్టం

వార్త 7లో..

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

వార్త 5లో..

విశాఖలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద నీట్ అభ్యర్థులు

ప్రశాంతంగా నీట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జరిగే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఆదివారం విశాఖ నగరంలో ప్రశాంతంగా జరిగింది. విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో ఈ పరీక్షలను నిర్వహించారు. 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టారు. ఆదివారం 7344 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా సుమారు 6500 మంది హాజరైనట్లు తెలిసింది. జిల్లాలో 16 కేంద్రాలను రెండు విభాగాలుగా విభజించి విశాఖపట్నం, భీమునిపట్నం ఆర్‌డిఒలకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రెండు కేంద్రాలకు ఒక సూపర్‌వైజర్‌ను నియమి ంచారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించలేదు.

110 ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు

- అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- 'ప్రజాశక్తి'తో ఎన్‌టిఆర్ వైద్య సేవ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా 110 ఆసుపత్రుల్లో సేవలు అందుతున్నాయని ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. పథకం అమలుపై వస్తున్న అవాస్తవ వార్తలను నమ్మొద్దని పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఉచిత వైద్య సేవలు నిలిచిపోయినట్లుగా జరుగుతున్న ప్రచారంలో నిజమెంత ?

ఆ ప్రచారంలో నిజం లేదు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లుల విషయం వల్ల పలువురిలో ఆ సందేహం కలిగింది. జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారందరికీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఉచితంగానే వైద్యం అందుతోంది.

జిల్లాలో ఉచిత వైద్య సేవలు అందుతున్న ఆసుపత్రులు ఎన్ని ఉన్నాయి ?

ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు అందించే ఆసుపత్రులు జిల్లాలో 110 ఉన్నాయి. వీటిలో 25 ప్రభుత్వ ఆసుపత్రులు

ఉన్నాయి.

ఎన్ని రకాల వైద్య సేవలు లభిస్తాయి ?

ప్రభుత్వం నిర్ణయించిన మేరకు

3200 వరకు అన్ని రకాల శస్త్ర చికిత్సలు సకాలంలో లభిస్తున్నాయి. తెల్ల రేషన్ కార్డు, ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) కార్డు ఉంటే చాలు.

నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆర్‌డిఒ కార్యాలయంలో.. ఆ నోటిఫికేషన్ లేదట !

అవగాహన కల్పిస్తున్నామని గ్రామాల్లో చెప్పిన ఆర్‌డిఒ, విఎంఆర్‌డిఎ అధికారులు సమాచార చట్టం కింద చేసిన దరఖాస్తుపై ఈ విషయం కూడా చెప్పకుండా దాటవేశారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తున్నారా, విఎంఆర్‌డిఎ ద్వారా టిడిఆర్ బాండ్లు ఇవ్వనున్నారా ? అని అడిగితే పరిహారం ఎలా ఇస్తామన్నది చెప్పకుండా టిడిఆర్ అవగాహన కార్యక్రమం 2025 ఏప్రిల్ 3 నుంచి 10 వరకు మునగపాక మండలంలోని ఐదు గ్రామాలు, అనకాపల్లి సౌత్, అచ్యుతాపురం మండలంలోని ఐదు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు తప్పితే బాధితులకు పరిహారం ఎలా చెల్లిస్తామని మాత్రం చెప్పలేదు. అధికారుల లిఖితపూర్వక సమాధానంలో 2013 భూ సేకరణ చట్టం కింద జారీచేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసినట్లు పేర్కొనకపోవడంతో ఆర్‌డిఒ చెప్పిన మాటలపై అనుమానాలు ఏర్పడుతున్నాయి. పరిహారం చెల్లింపులో అధికారులు చెబుతున్న మాటల్లో ఏది నిజమో ? ఏది అబద్ధమో ? తెలీని పరిస్థితి నెలకొంది.

110 ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు

మిత్రాల పని విధానం సక్రమంగా ఉందా ?

వైద్య మిత్రాలు సక్రమంగా విధులకు వస్తున్నదీ, లేనిదీ, వారి పని విధానం ఎలా ఉన్నదీ, రోగులకు అందుతున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయి ? అన్న విషయాలను జిల్లా మేనేజర్ శ్రీనుబాబు పర్యవేక్షిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల టీం లీడర్లతో నిత్యం తనిఖీ చేస్తున్నారు.

నెట్ వర్క్ పరిధిలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులవారు పథకం అమలు విషయంలో రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం మీ దృష్టికి వచ్చిందా ?

ఇటువంటి ఫిర్యాదులు మా దృష్టికి వస్తున్నాయి. వెంటనే స్పందించి, సమస్యలు లేకుండా చూస్తున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) కార్డు ఉన్న వారందరికీ తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉచితంగా వైద్య సేవలు అందివ్వాలి.

వైద్య మిత్రాలు, టీం లీడర్ల సమస్యల పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు ?

వారి సమస్యలను పరిష్కరిస్తాం. అదే సమయంలో నెట్ వర్క్ ఆసుపత్రుల వారి సమస్యల పరిష్కారానికీ చర్యలు చేపడతాం.

ఘనంగా మేడే సాంస్కృతికోత్సవాలు

ఉద్యోగులు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగానూ, డాక్ యార్డ్ ఉద్యోగులు సేఫ్టీపైనా లఘు నాటికలు ప్రదర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులు మేడే గీతంపై నృత్యరూపకం ప్రదర్శించారు. రాజరాజేశ్వరి దళం కోలాటం ప్రదర్శించింది. రైల్వే మహిళా ఉద్యోగి చిన్న మరియమ్మ సినీ దేశ భక్తి గేయాన్ని ఆలాపించారు. ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగి శేఖర్ ఫ్లూట్‌పై దేశ భక్తి గేయాన్ని ఆలపించారు. ఫ్రాన్సిస్, ప్రసాద్, బసు పోతన, సంతోషం, లలితలు కవితలు వినిపించారు. దాదాపు 64 వరకు కళారూపాలు ప్రదర్శించారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు కార్యక్రమాన్ని సమన్వయం చేసి నడిపించారు. ముగింపు సభలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణ, విశాఖ పౌర గ్రంథాలయ సేవా సంస్థల అధ్యక్షులు బిఎల్.నారాయణ, ఎల్ఐసి ఏజెంట్ రమణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి కోటేశ్వరరావు పాల్గొని అందరికీ సర్టిఫికెట్టు ప్రదానం చేశారు. టీమ్‌లకు మెమొంటోలు అందించారు. రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో చిత్రకళా పరిషత్ అధ్యక్షులు సుంకర చలపతిరావు, ఆంధ్ర యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎస్ఎంఇ డిపార్ట్మెంట్ ఆఫ్ జర్నలిజం డాక్టర్ విజయవేణి, గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, ఒమ్మి అనిల్ కుమార్ పాల్గొని సందేశం ఇచ్చారు. ఈ సాంస్కృతికోత్సవాలు జిఎస్.రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావులతో పాటు కమిటీ సభ్యులు బుజ్జి, ఎం.ఎల్లాజీ, సత్యనారాయణ, సతీష్‌ల పర్యవేక్షణలో సాగాయి.

ఉక్కు నగరంలో కళారూపాలతో ఆకట్టుకున్న మహిళలు

ఉక్కునగరం : ఉక్కునగరంలో మేడే సాంస్కృతిక వేడుకలను రెండు రోజులపాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్లాంట్‌లో కార్మికులు సంతోషంగా పనిచేయాలంటే ఇంటి వద్ద భార్య, పిల్లలు సంతోషంగా ఉండాలన్నారు. అలా ఉండాలంటే మహిళలు, పిల్లలు ఆటపాటలతో సంతోషంగా గడపాలని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఎదుర్కోవాలంటే మహిళలు ఉద్యమంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ కె.విమల మాట్లాడుతూ మహిళల మద్దతుతో ఎలాంటి ఉద్యమమైనా విజయవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, గుర్రం రమణ, ఎంవిఎన్.మూర్తి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, పృథ్వీ, కె.వేణు, ఎ.కోటేశ్వరరావు, వై.సువర్ణరాజు, రాజా, పుల్లారావు, మొహిద్దీన్, కె.సత్యనారాయణ, కామేష్, కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్సాహం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రీడలలో పాల్గొనడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఎయు న్యూ జిమ్నాజియంలో ఆదివారం తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ పురుషులు, మహిళల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పించిందని, యువత క్రీడల్లో విరివిగా పాల్గొని తమ ప్రతిభను వెలికి తీయాలని అన్నారు. ఎయు రిజిస్ట్రార్ ఇఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడలకు ప్రత్యేకమైన సహకారాన్ని అందిస్తోందన్నారు. ఎయు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయ మోహన్ మాటా ్లడుతూ ప్రతిభగల క్రీడాకారులకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. విశాఖపట్నం జిల్లాలో క్రీడా కోటాలో 32 పోస్టులు ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ ఆనందబాలు, వివిధ కిక్ బాక్సింగ్ యూనియన్ల అఫీసియల్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో విసి రాజశేఖర్

వెంకటేశ్వర మెట్ట

ఇళ్ల స్థలాల సమస్య త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 33వ వార్డు అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం సర్వే నెంబర్ 1450, 1261 స్థలాలలో ఉన్న పక్కా గృహాల వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఆరు మాసాలలో సమస్య పరిష్కారం కానుందని ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర మెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి శ్రీనివాస్ నాయకత్వంలో బృందం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావును ఆదివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూములలో 130 సంవత్సరాల నుంచి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌తో తాము అక్కడ నివసిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆ స్థలాలు దేవాలయానికి చెందినవని, ఖాళీ చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తరచూ తమను వేధిస్తున్నారని చెప్పారు. దీనికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బదులిస్తూ ఈ సమస్యపై తాను అసెంబ్లీలో రెండు పర్యాయాలు మాట్లాడినట్టు తెలిపారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులతోనూ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యను ఆరు మాసాలలోగా పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విల్లూరి డాక్టర్ చక్రవర్తి, వెంకటేశ్వర మెట్ట వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన శరగడం పెద్ద, కోరిబిల్లి శ్యామ్, తనకాల గోవిందరావు, అప్పారావు, అప్పారావు, పీలా రవి, మహిళలు సుభానా బీబీ, వెంకటలక్ష్మి, పూతి లక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పల్లాను టిడిపి అధ్యక్ష స్థానం నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబును వైసిపి నాయకులు విమర్శిస్తున్నప్పటికీ కనీసం నోరు మెదపలేని స్థితిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఉన్నారని, ఆయన్ని ఆ స్థానం నుంచి తొలగించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. పల్లా వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తున్నారని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఆదివారం దసపల్లా హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై పల్లా శ్రీనివాసరావు, అతని అనుచరులు చేస్తున్న ఆరోపణలపై ముఖాముఖి చర్చకు హోటల్ దసపల్లా వేదికగా కార్యక్రమం ఏర్పాటు చేయగా వారెవరూ రాలేదన్నారు. చంద్రబాబుపై ఇష్టానుసారంగా విమర్శలు చేసిన గుడివాడ అమర్‌నాథ్ అక్రమ నిర్మాణాన్ని కూల్చకపోతే నీకు వచ్చిన నొప్పి ఏంటి ? అని పల్లా అనుచరులు తనను ప్రశ్నిస్తున్నారని రామ్ తెలిపారు.

తిరుమలరావు సేవలు ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోలీసు అడిషనల్ ఎస్‌పిగా కోనా తిరుమలరావు చేసిన సేవలు ఆదర్శప్రాయమైనదని ఇన్‌కం ట్యాక్స్ మాజీ అదనపు కమిషనర్ వడ్డాది అప్పలరాజు ప్రసంశించారు. అమరావతిలో అడిషనల్ ఎస్‌పిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కోనా తిరుమలరావును ఆదివారం ఉదయం విశాఖలోని ప్రముఖ హోటల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డి.ఆడమ్స్ మాట్లాడుతూ పోలీసు శాఖలో 36 ఏళ్ల వివిధ హోదాల్లో సేవలందించారని చెప్పారు. కోనా తిరుమలరావు మాట్లాడుతూ ఉద్యోగిగా భాద్యతతో చేసిన పనులను గుర్తించి అభినందిస్తున్న సహోద్యోగులకు, పలు సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.మధుసూదనరావు, కళా సంస్థల కార్యదర్శి చెన్నా తిరుమలరావు, కార్పొరేటర్ చెన్నా జానకిరావు, బండి ఆది సురేంద్ర, ఎస్.కల్యాణ ముని తదితరులు తిరుమలరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

గెలాక్సీ సిరీస్‌పై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సామ్‌సంగ్ తమ పరిమిత కాల ఆఫర్‌లో భాగంగా విశాఖ నగరంలో ఎంపిక చేసిన గెలాక్సీ ఎ, ఎం, ఎఫ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లపై విశాఖలో తగ్గింపు ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా సిరిపురంలోని స్టోర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్టోర్ హెడ్ శ్రీని మాట్లాడుతూ రూ.42,999 విలువగల గెలాక్సీ ఎ55 5జి ఈ నెల 1 నుండి రూ.26999కి అందుబాటులో ఉందన్నారు. గెలాక్సీ ఎం16 5జి, గెలాక్సీ ఎఫ్16 5జి, గెలాక్సీ ఎం06 5జి, గెలాక్సీ ఎఫ్06 5జి తగ్గింపు ధరలలో లభ్యమవుతున్నాయన్నారు

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌కు అంతర్జాతీయ ఖ్యాతి

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు కైవసం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా వినూత్న విద్యను విద్యార్థులకు అందించడంలో ప్రఖ్యాతిగాంచిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అంతర్జాతీయ ఖ్యాతిని సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వారికి అందించే ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు 2025ను స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు అందుకున్నారు. ఈ నెల 3న శ్రీలంక రాజధాని కొలంబోలో అన్యేల్ప్ గ్రూప్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రముఖ తెలుగు నటుడు అలీ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా మళ్ల రామునాయుడు మాట్లాడుతూ ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఆసియాలోని ఎనిమిది దేశాల నుంచి వచ్చిన విద్యావేత్తలు పాల్గొన్నారని, వివిధ విభాగాల్లో మొత్తం 35 అవార్డులు అందించారని తెలిపారు. అందులో తనకు విద్యా రంగంలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, భవిష్యత్తు దృష్టికోణాన్ని ప్రోత్సహించే వ్యక్తిగా గుర్తించి ఈ అవార్డును అందజేయడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఇది తనకు మాత్రమే లభించిన గౌరవం కాదని, ఇది అందరి గౌరవమని, నిత్యం తనకు ప్రేరణ కలిగించే పిల్లలు, నమ్మకంతో నిలిచే తల్లిదండ్రులు, అంకితభావంతో పనిచేసే గురువులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తున్నానని చెప్పుకొచ్చారు. తమ స్కూల్‌ను దేశవ్యాప్తంగా ఈ-పాఠశాల కాన్సెప్ట్ విస్తరించడంలో సహకరిం చినందుకు ఎపిపియుఎస్ఎంఎ, టిఆర్ఎస్ఎంఎ, ఎన్ఐఎస్ ఎలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు స్వీకరిస్తున్న మళ్ల రామునాయుడు

పింఛన్ల కోసం ఎదురుచూపు

- ఆంక్షలు విధించడంతో అయోమయం

ప్రజాశక్తి -ఆనందపురం : గత ప్రభుత్వం కాలంలో నూతన పింఛన్లు మంజూరు కాకపోవడంతో కొత్త ప్రభుత్వమైనా పింఛన్లు మంజూరు చేస్తుందని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న వారికి కూటమి ప్రభుత్వం ఆంక్షల పేరుతో షాక్ ఇచ్చింది. దీంతో పింఛన్ వస్తుందనుకున్న వారు అయోమయంలో పడ్డారు. 2023 డిసెంబర్ 1 తర్వాత మృతిచెందిన వారి కుటుంబాలకు సంబంధించి మాత్రమే వితంతు పింఛన్లకు దరఖాస్తులు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు రావడంతో అర్హత ఉండి పింఛన్ రానివారు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత మూడేళ్లుగా పింఛన్లు రాక వితంతువులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2023 డిసెంబర్ 1వ తేదీకి ముందు చనిపోయిన వారి కుటుంబాల నుంచి దరఖాస్తులు తీసుకోవడంలేదు. దీనిపై ప్రశ్నిస్తున్న వారికి పంచాయతీ అధికారులు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

ఆనందపురం మండలం వెల్లంకి గ్రామానికి చెందిన దళిత మహిళ రవ్వ నర్సియమ్మ (65) భర్త అప్పలసూరి అనారోగ్య కారణంగా 2023 సెప్టెంబర్ 26న అనారోగ్య కారణంగా మృతి చెందారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆమె భర్త మరణించడంతో పింఛన్ కోసం అప్పట్నుండి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2023 డిసెంబర్ 1వ తేదీ తర్వాత మరణించిన వారి కుటుంబ సభ్యులకు పింఛన్ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పడంతో ముందుగా ఉన్న ఆమె లబోదిబోమంటున్నారు. పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా 'మీ దరఖాస్తు ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదు.. మేము ఏమీ చేయలేము' అని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయక, కూటమి ప్రభుత్వమైనా ఇస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఇలాంటి నరసయ్యమ్మ వంటి వారు ఎంతోమంది ఉన్నారని, అందరికీ పింఛన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదని, ప్రభుత్వం మరలా ఏమైనా ఆదేశాలిస్తే తప్ప తాము ఏమీ చేయలేమని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి చెప్పారు.

పింఛన్ కోసం తిరుగుతున్న రవ్వ నర్సయ్యమ్మ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. త్రినాధపురం గ్రామానికి చెందిన ప్రకాష్ (32) ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెరువును పరిశీలిస్తున్న రవితేజ, కూటమి నాయకులు

చిల్లపేట పెద్ద చెరువు పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిల్లపేట పెద్ద చెరువును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ ఆదివారం కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. 2014 - 19 మధ్య కాలంలో గంటా శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో చెరువు అభివృద్ధికి రూ.1.90 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చెరువు గట్టు పటిష్టతకు చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రభుత్వం మారిన దరిమిలా చెరువు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. చెరువులో నీరు పాడై తరచూ దుర్వాసనతో పరిసర ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానిక కూటమి నాయకులు కోరారు. చెరువు విస్తీర్ణం ఎంత ఉండాలి, ప్రస్తుతం ఏమేరకు ఉంది? భౌగోళిక స్థితి గతులను ఇతర వివరాలను టిడిపి నాయకులు పిట్ట సురేష్ ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల రమేష్, చిలకా నరసింగరావు, గంటా నూకరాజు, కొప్పల కృష్ణ, జనసేన నాయకులు నీలాపు శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై వినతి

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు గ్రామస్తులు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ లేక విద్యార్థులు, రైతులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూటమి నాయకులు ఉప్పాడ అప్పారావు తదితరులు పేర్కొన్నారు. వీటితోపాటు గ్రామంలోని పలు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరిపిల్ల శ్రీనివాసరావు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురంలో అపారిశుధ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం గ్రామపంచాయతీలో ఆపారిశుధ్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ తెలిపారు. గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పాలకవర్గం పనులు చేయిస్తోందని, దీంతో తూతూ మంత్రంగా పనులు సాగుతున్నాయని తెలిపారు. ఎక్కడికక్కడ చెత్త ఉండిపోతుందని పేర్కొన్నారు. ఆనందపురం సంత సమీపంలోనూ, 24 కాలనీ తదితర చోట్ల చెత్త పేరుకుపోయి ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతున్నాయని వివరించారు. పాలకవర్గం స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని అమనాం గ్రామంలో ఉన్న శ్రీ గణపతి సహిత అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిరాజు కుమారశాస్త్రి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు జనసేన అధ్యక్షులు నీలాపు శంకరరెడ్డి ఆధ్వర్యాన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందిన వారికి ఆదివారం సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. నమ్మివానిపేట, ఇడదాసరిపేట, వలందపేట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ కిట్లు అందజేసినట్లు శంకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సభ్యత్వం పొందిన వారందరినీ అభినందించారు.

ప్రయివేటు విద్యా సంస్థలపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - ఆరిలోవ : కూటమి ప్రభుత్వంలో ప్రయివేటు విద్యాసంస్థలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని, గత ప్రభుత్వ విధానాల కంటే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపట్ల కరస్పాండెంట్‌లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని విశాఖ జిల్లా అపుస్మా జోన్ -1 అధ్యక్షులు ఎంవి.రావు అన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అపుస్మా కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా ఎదో ఒక జిఒతో ఈ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రయివేటు స్కూళ్లకు రికగ్నైజేషన్ సమయంలో అందించిన ఫారం -1ను ఇప్పుడు బయటకు తీసి దానిలో మార్పులు చేసి మరలా సబ్మిట్ చేయమంటున్నారని తెలిపారు. ప్రయివేటు స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాల వివరాలు అన్‌లైన్ చేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల వివరాలు ప్రభుత్వం ఆన్‌లైన్ చేయగలదా అని ప్రశ్నించారు. అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కార్పొరేట్ విద్యా సంస్థలకు అనుకూలంగా ఉందని, బడ్జెట్ స్కూళ్ల మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. జనరల్ సెక్రటరీ యు.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా చేపట్టిన నిరుద్యోగ సర్వేలో నిరుద్యోగుల శాతం తగ్గించడానికి ప్రయివేటు పాఠశాలలో పనిచేస్తున్న నిరుద్యోగులను ఉద్యోగులులగా చూపించాలనే ప్రయత్నంలో భాగమే ఈ ఫారం -1 రీ షెడ్యూల్ నిర్ణయమని ఆరోపించారు. ఫారం-1లో తాము కోరిన పాయింట్స్ తొలగించి ఆర్థిక పరమైన విషయాలలో వెసులుబాటు కల్పిస్తే అంగీకారంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో జరిగే ప్రయివేటు స్కూల్స్ యూనియన్ మీటింగులో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ట్రెజరర్ జి.శేషగిరిరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989- 90, 2013 - 14 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థితికి వెళ్ళినప్పుడు తల్లిదండ్రులతో పాటు గురువులకు కూడా ఎంతో గర్వకారణంగా ఉంటుందన్నారు. మీ వృత్తులతో పాటు సమాజసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, మనలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఐకమత్యంగా పరిష్కారానికి పాలుపంచుకుంటామన్నారు. అప్పటి విద్యార్థుల్లో కొంతమంది మృతి చెందడంతో వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు సన్యాసిరావు, ప్రస్తుత ఉపాధ్యాయులు కెఆర్‌కె.పట్నాయక్, పిఇటి జాన్ రబ్బి, తెలుగు మాస్టర్ నాగమౌళి, చంద్రకుమారి, అశోక్ నంద, లక్ష్మీతారకేశ్వరరావు, రాణి, చత్రపతి తదితరులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు సంపంగి అనిల్, బంటుపల్లి ఈశ్వరరావు, వంశీ, ఉప్పిలి వెంకట్, కంది రాంబాబు తదితరులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో తోటి విద్యార్థులు అభినందించారు.

వక్తృత్వ పోటీల్లో స్ప్రింగ్ ఫీల్డ్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -పద్మనాభం : 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అన్న అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. స్ప్రింగ్ ఫీల్డ్ ప్రయివేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.సాయిమోహన్‌కు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ రూ.5000 నగదు బహుమతిని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా కేథరిన్ సంస్థలలో భాగమైన స్ప్రింగ్ ఫీల్డ్ విద్యాసంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలివర్ ఆర్ రాయి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను రూపొందించడంలో తమ పాఠశాల ముందంజలో ఉంటుందన్నారు. ఇందుకు కారకులైన ఉపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపల్ ప్రీతిలను కొనియాడారు. గెలుపొందిన విద్యార్థికి అభినందనలను తెలియజేశారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న బాలికలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో ఆదివారం నిర్వహించిన వారంతపు సాంస్కృతిక కా ర్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. రాజేశ్వరి కూచిపూడి కళామిత్ర చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ముందుగా మహాగణపతిం, బ్రహ్మమొక్కటే, మూషిక వాహన, రామాయణ శబ్దం, చక్కని తల్లికి చాంగు బల, అదివో అల్లదివో, గోవింద గోవింద, శివతాండవం, భావములోన, గణేష్ స్తుతి, అమ్మ భవాని, ఏకదంతాయ గేయాలకు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కృతిక, వీక్షిత, బాల భార్గవి, విష్ణు సాయి, ప్రియదర్శిని, ఉజ్వాలా, శ్రీజ, సిద్దేశ్వర్, హేమ స్వరూప్, సాయి కౌశిక్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీవిజేత స్కూలు కరస్పాండెంట్ కీర్తిశేషులు వైసి.రాజు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆరిలోవ బాలాజీనగర్‌లో జివిఎంసి ఆధ్వర్యాన నడుస్తున్న అమ్మా నాన్న ఛారిటబుల్ ట్రస్టులో ఉన్న నిరాశ్రయులైన వృద్ధులకు ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. అంతక ముందు శ్రీవిజేత స్కూలు ప్రాంగణంలో వైసి.రాజు చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు నివాళు లర్పించారు.

స్కిట్స్ ప్రదర్శిస్తున్న కళాకారులు

ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన ప్రతి నెలా నిర్వహించే "వినోదాల విందులో భాగంగా పౌరగ్రంథాలయంలో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షులుగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతినిధి ఎంవి.సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఈ సందర్భంగా చల్లగా ఉండు, డాక్టర్ పేషెంట్, ఛానల్ ఓపెన్ అయింది, సూర్య నమస్కారాలు, ఓటిపి, పొదుపు, పచ్చడి తదితర స్కిట్లు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, అనన్య, పింకీ శాస్త్రీయ నృత్యంచేశారు. అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, గణేష్, కుమారి, నాయుడు, గోపీకృష్ణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు

వజ్రాల ప్రదర్శన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని హోటల్ రామచంద్రలో రేర్ సాలిటైర్ వజ్రాలను ప్రదర్శించారు. ఆదివారం నాటి ప్రదర్శనలో హరికృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ డోలోకియా మాట్లాడుతూ, కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యుయలరీలో నాణ్యత గల వజ్రాలు లభిస్తున్నాయని తెలిపారు. కిస్నా బ్రాండ్ దృష్టి ప్రతి భారతీయునికీ వజ్రాలను అందుబాటులో ఉంచడమేనని చెప్పారు. గాజువాక వంటి అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇలాంటి ప్రదర్శనలతో, వినియోగదారులకు పారదర్శకంగా, సరసమైన ధరలకు నాణ్యమైన వజ్రాలను అందించడమే తమ లక్ష్యమని వివరించారు. కిస్నా గాజువాక ఫ్రాంచైజ్ భాగస్వాములు రాంబాబు కొత్తపల్లి, లక్ష్మణరావు, భీమారావు, దామోదరరావు మాట్లాడుతూ, గాజువాకలో వజ్ర ప్రియుల కోసం మొదటిసారిగా ఈ ప్రదర్శన నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులు 0.30 సెంట్ల నుండి 5 క్యారెట్ల వరకు సాలిటైర్ వజ్రాలను కొనుగోలు చేయవచ్చన్నారు. కేవలం రూ.32 వేల నుంచి తమ వద్ద అపురూప వజ్రాలు లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శనలో మహిళా వినియోగదారులకు మెహందీ కార్యక్రమం, ప్రతి వినియోగదారునికీ బహుమతి అందజేశారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలో కణితి రజకవీధిలో నివసిస్తున్న వైసిపి కార్యకర్త సుధమాల శివ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు, కొంత ఆర్థిక సహాయంతో పాటు మరి కొంతమంది నిరుపేద మహిళలకు చీరలను మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమం చేపట్టిన వార్డు నాయకులను అభినందించారు. వైసిపి కార్యకర్తలకు, అభిమానులకు ఎటువంటి సమస్య వచ్చినా తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, కర్రి నాగేశ్వరావు, గాలి ఆనంద్, కె.పారేపల్లి, గుంట్ల శ్రీను, ఎం నర్సింగరావు, సిహెచ్.అంజయ్య, కారణం లక్ష్మి, కనక, గాలి నూకరాజు, గాలి రమణమ్మ, పాల్గొన్నారు.

సరుకులు, చీరలు పంపిణీ చేస్తున్న చింతలపూడి

ఘనంగా దాసరి జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యాన దాసరి జయంతి వేడుకలు, మానికొండ చలపతిరావు పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. కుల వివక్షతపై దాసరి రచించిన ఒసేయ్ రాములమ్మ చిత్రంలోని 'చౌదరి గారు రాయుడు గారు' పాటతో సభ ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబీవర్ధన్ మాట్లాడుతూ, సినీ దర్శకులు దాసరి నారాయణరావు, పాత్రికేయులు మానికొండ చలపతిరావు మధ్య సామాజికంగా ఒకే సారుప్యత ఉందని పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను చలపతిరావుకు అప్పగించినప్పుడు అప్పటి ప్రధాని నెహ్రూ పత్రికా స్వేచ్ఛ మనిషి ప్రాణం వంటిదని భావించారన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చలపతిరావు ఆ పత్రికలో రాశారని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్రంలో పుట్టి అంతర్జాతీయంగా మానికొండ చలపతిరావు పేరు తెచ్చుకున్నారన్నారు.

ప్రజల పక్షాన పత్రికలు నిలబడాలంటే దాసరి వంటి వారు మరలా పుట్టాలని ఆకాంక్షించారు. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న సమయంలో తాతా మనవడు వంటి చిత్రాన్ని దాసరి తీసారని గుర్తు చేశారు. సామాజిక సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకొని దాసరి అనేక సినిమాలను తీశారన్నారు. జర్నలిజంలో దాసరి చేసిన ప్రయోగం ఉదయం పత్రిక అన్నారు. తెలుగు నాట పరిశోధనాత్మక జర్నలిజం ఉదయం పత్రిక ద్వారా వచ్చిందని చెప్పారు.

గౌరవ అతిథి మిర్యాల వెంకట్రావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కటారి అప్పారావు మాట్లాడుతూ, దాసరి 150 సినిమాల్లో 100 సామాజిక చిత్రాలు ఉంటాయన్నారు. ఆత్మీయ అతిథులు ప్రముఖ పాత్రికేయులు సాగర్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో దోపిడీ ఉందని, ప్రజలు ప్రతిఘటించే తీరును మానుకొండ చలపతిరావు వంటి వారు బయటపెట్టారని గుర్తు చేశారు. దర్శకులు దాసరి సినిమాల ద్వారా వ్యవస్థలోని లోపాలను చూపించారని తెలిపారు. మరో ఆత్మీయ అతిథి పిల్లల రామకృష్ణారావు మాట్లాడుతూ, నేడు పాత్రికేయులందరూ చలపతిరావు గురించి తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు.

పుస్తక రచయిత ఆకుల అమరయ్య మాట్లాడుతూ, నాటి జర్నలిజానికి నేటి జర్నలిజానికి తేడా ఉందన్నారు. ఆనాడు కార్పొరేట్ జర్నలిజం లేదని, నేడు వచ్చేసిందని తెలిపారు. ఇక నుండి ప్రతి ఏటా రచయిత చెప్పినట్టు ఎం.చలపతిరావు పేరుతో అవార్డు, దాసరి షార్ట్ ఫిలిం అవార్డులను అందజేస్తామని రైటర్స్ అకాడమీ అధినేత వివి.రమణమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖులు కె.రమణ, డాక్టర్ కెవిఎస్.మూర్తి, పిలానిల తిలక్, పాత్రికేయులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

దాసరి, మానికొండ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

మృతుల కుటుంబాలకు సిపిఎం పరామర్శ

చంద్రంపాలెంలో దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మధురవాడ : చందనోత్సవం సందర్భంగా జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన పిళ్లా మహేష్, శైలజ దంపతుల కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు పరామర్శించారు. చంద్రంపాలెంలోని వారి గృహంలో మహేష్, శైలజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే మహేష్, శైలజ మృతిచెందడం ప్రజందరినీ కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదం జరగడానికి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం తప్ప మరో కారణం కాదని అన్నారు. పిల్లర్లు, కాంక్రీటు బెల్టులు వేయకుండా గోడ ఎలా కట్టారని చూసిన వారంతా ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్ల మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద మృతుల కుటుంబాలకు సిపిఎం మద్దతుగా నిలబడుతుందన్నారు. ఆ కుటుంబాలకు, ప్రజలకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్, గారే చిన్నారావు, వెంకటరమణ, జి.కిరణ్, డి.కొండమ్మ, బి.భారతి తదితరులున్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : పెహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి, చందనోత్సవంలో గోడ కూలి మృతిచెందిన వారికి విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన సింధూర ఫంక్షన్ హాల్లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, పర్యాటకులు, సామాన్య ప్రజలపై ఉగ్రవాదులు దాడులు చేయడం బాధాకరమని, ఏ ఒక్కరూ ఇటువంటి చర్యలను సమర్థించరని పేర్కొన్నారు. తీవ్రవాదాన్ని అణిచి వేయడానికి ప్రపంచంలోని అత్యధిక దేశాలు ముందుకు వస్తున్నాయన్నారు. సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై లక్షలాది మంది భక్తులను కలిచి వేసిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్రే నాంచారయ్య, సినీ డైరెక్టర్ యాద్ కుమార్, సంగీత కళాకారులు మనోహర్ ప్రసాద్, ధనుంజయ్, రాథో గణేష్, జి.సతీష్, సత్య తదితరులు పాల్గొన్నారు.

18న మాధవ యువజన సమాజం ఎన్నికలు

ప్రజాశక్తి -మాధవధార : మాధవధారలోని మాధవ యువజన సమాజం ఎన్నికలు ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నారు. నామినేషన్ చివరి రోజు ఆదివారం కావడంతో మాధవధార గ్రామ ప్రాంత వాసులు, మహిళలు నామినేషన్లు వేయడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేషన్ ఎన్నికల వలె నామినేషన్ వేసే అభ్యర్థులు డబ్బులు డెవలక్కలతో మాధవధార ప్రాంతమంతా మారుమోగింది. స్వాతంత్రం రాక మునుపు 1948లో మాధవధార ప్రాంతంలో ఉండే పూర్వీకులు శ్రీ మాధవ యువజన సమాజాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మాధవధార గ్రామ అభివృద్ధికి పూర్వీకులు ఎంతో కృషి చేశారు. ధనంతో పాటు తమ సొంత ఆస్తులను దానం చేసి మాధవధార గ్రామ అభివృద్ధికి కృషి చేశారు.

నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ కెవి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ఆదివారం కౌనిసెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, మంచి ప్రవర్తనతో, క్రమశిక్షణతో ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో ఉంటే రౌడీ షీట్లను మూసివేయాలని పై అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. నేరజీవితం వదిలి కుటుంబంతో కలిసి సమాజంలో మంచి జీవితాన్ని గడపాలని, పోలీస్ శాఖ సహకారంగా ఉంటుందని తెలిపారు.

జేడీ ఫౌండేషన్‌కు అవార్డులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : రోటరీ క్లబ్, అబ్దుల్ కలామ్ మెడిటెక్ జోన్ సంయుక్తంగా స్టీల్‌ప్లాంట్ వద్ద నిర్వహించిన సామాజికం-2025 సిఎస్ఆర్ మీట్ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ విశాఖపట్నం ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్ ఏర్పాటు చేసింది. వివిధ సంస్థల సిఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొని ఫౌండేషన్ స్టాల్‌ను వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సామాజిక 2025 అవార్డులు ప్రకటించారు. ఇందులో జేడీ ఫౌండేషన్‌కు ఉన్నతమైన విద్య, అక్షరాస్యత కేటగిరిలో బెస్ట్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం అవార్డు, పర్యావరణ పరిరక్షణ కేటగిరిలో బెస్ట్ ఇనిషియేటివ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ కన్సర్వేషన్ అవార్డు దక్కించుకుంది. ఈ అవార్డులను రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, విశాఖ కన్వీనర్ సలాది కృష్ణయ్య, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న జెడి ఫౌండేషన్ సభ్యులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : దేశంలోని కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు అమలు, రైతులకు గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఈనెల 20న జరిగే సమ్మెలో కార్మికులు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సులో మాట్లాడుతూ,. లేబర్ కోడ్స్‌తో కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు కోల్పోయి, యాజమాన్యాలకు కట్టుబానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వివాదాలు చట్టానికి తూట్లు పొడిచేలాపలు దుర్మార్గమైన విధానాలు లేబర్ కోడ్స్‌లో పొందుపరిచారని, వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించకుండా తిప్పుకొట్టాలన్నారు.

సదస్సులో రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ మాట్లాడుతూ నేటి ప్రభుత్వ విధానాలతో రైతులు కూలీలు జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో నల్లసాగు చట్టాలపై జరిగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో 20 సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు సదస్సులో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు దుర్గారాణి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ పార్వతి మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఆర్ రాము, గనిశెట్టి సత్యనారాయణ, జి దేవుడునాయుడు, ప్రేమ్‌చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు తీవ్రమైన హానిచేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభ రాజు, విశాఖ హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు రమణబాబు, హెచ్ఎంఎస్ నాయకులు మంగయ్య నాయుడు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు త్రినాథరావు, బి.లక్ష్మణరావు, సిఎఫ్‌టియు జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎన్‌టియుసి నాయకులు బి.వెంకటరావు, సిఐటియు నాయకులు బి.జగన్ పాల్గొన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌తో జరిగే నష్టాన్ని వివరించారు. సమ్మె హక్కును కాజేయడం అన్నింటికంటే లేబర్‌కోడ్‌లో ప్రమాదకరమైందన్నారు. మేజర్ పోర్టుల్లో 2024 సెప్టెంబర్ 27న సంతకం చేసిన వేతన ఒప్పందంలో అంగీకరించిన విధంగా స్టాగ్నేషన్, ఇతర సమస్యలపై చర్చించడానికి వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మేజర్ పోర్ట్స్ అథారిటీస్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ప్రధాన ఓడరేవులలో జాతీయ ఆస్తుల మానిటైజేషన్ పైప్‌లైన్ విధానాన్ని అమలు చేయడం తగదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

వైసిపి కార్యాలయం ప్రారంభం

మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ పెట్రోల్ బంకు సమీపంలో పెందుర్తి నియోజకవర్గ వైసిపి కార్యాలయాన్నిమాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్,పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, వైసిపి కేంద్ర కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ అధ్యక్షతన సమావేశంలో బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలును పక్కనబెట్టి, విపక్ష నేతలపై కక్షపూరిత చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ ప్రజలకు, కార్యకర్తలకు అండగా, అందుబాటులో ఉండేందుకు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గండి రవికుమార్, సరగడం అప్పలనాయుడు, చొప్ప నాగరాజు, బయలుపూడి భగవాన్ జయరాం, పరవాడ ఎంపిపి పైల శ్రీనివాసరావు, ఉగ్గిన కనకరాజు, మాజీ జెడ్పిటిసి కోటాన రాము, వైసిపి మండల అధ్యక్షుడు కర్రి బాబు, సబ్బవరపు ముత్యాల నాయుడు, వడ్డాది అప్పలరాజు, బోను గంగు నాయుడు, పాల్గొన్నారు.

క్రికెటర్లకు జెర్సీల పంపిణీ

జెర్సీలను అందిస్తున్న మళ్ళ సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మండలం మారేడుపూడిలో ఆదివారం ప్రారంభమైన మారేడుపూడి ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) పోటీల్లో క్రికెట్ క్రీడాకారులకు అనకాపల్లి అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ చెందిన ఈగల నాయుడు ఆర్థిక సాయంతో జెర్సీలను రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ఇంటి వద్ద అందజేశారు. నెల రోజుల పాటు జరుగుతున్న ఎంపిఎల్ విజయవంతం కావాలని సురేంద్ర ఆకాంక్షించారు. క్రీడాకారులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిడి ప్రసాద్, ఎస్ భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్, క్రీడాకారులు ఈగల నాయుడు, పిల్లల రమణ, మాడిన నూక అప్పారావు, సంతోష్ కుమార్, కిరణ్, పీత శ్రీను పాల్గొన్నారు

పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

విద్యార్థులను సత్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- మునగపాక: పదవ తరగతి పరీక్షల్లో మండల టాపర్స్‌గా నిలిచిన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను స్థానిక తంపర మూల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు విద్యార్థులు ఆడారి లక్ష్మీ గణేష్(586), బుదిరెడ్డి రేణుక (579), టెక్కలి భాగ్యశ్రీ (578)లను. సంఘం అధ్యక్షులు శరగడం జగన్ దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మెరుగైన ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు . మరిన్ని ఉన్నత చదువులు చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, కాంగ్రెస్ మణికంఠ, ఆడారి గోవిందా, పెంటకోట శివ గణేష్, టెక్కలి ప్రసాద్, కాండ్రేగుల భాగ్యరాజు, దాడి నాయుడు, దాడి మురళి , విల్లూరి సోమనాయుడు, అప్పన్న, నాగరాజు, మాకినాయుడు చంద్ర పాల్గొన్నారు.

దేవరాపల్లి : పదవ తరగతిలో 590/600 మార్కులు సాధించిన మండలంలోని తిమిరాం గ్రామానికి చెందిన గుంపాన ఉదయ్‌కుమార్‌ను ఆప్త మిత్ర సంఘం సభ్యులు సత్కరించారు. రూ.5016 నగదు ప్రోత్సాహకం అందించారు. వేచలం ప్రభుత్వ పాఠశాలలో చదివి, మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. విద్యలో నైపుణ్యం పొందిన ప్రతి ఒక్కరికీ ఆప్త మిత్ర సంఘం సహాయ సహకారాలు ఉంటుందన్నారు. ఎంఇఒ బి.వడాల్‌దాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయ్‌కుమార్‌కు నగదు ప్రోత్సాహకమిస్తున్న 'ఆప్తమిత్ర'

జిల్లా అంతటా వర్షం

- ఒక్కరోజే 403 మిల్లీమీటర్లు వర్షపాతం
- అన్ని మండలాల్లో కురిసిన వాన

అనకాపల్లిలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : గ్రామీణ జిల్లా అంతా ఆదివారం వర్షంతో తడిసి ముద్దయింది. ఇటీవల కాలంలో అక్కడక్కడ మాత్రమే కురిసిన వర్షం జిల్లా మొత్తాన్ని తడిపేసింది. ఉదయం నుంచే మేఘావృతమైన వాతావరణం కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వాన కురవగా మరికొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. మొత్తం మీద జిల్లా అంతటా 403 మిల్లీమీటర్ల వాన కురిసింది. నక్కపల్లిలో అధిక మొత్తంలో 54.2 ఎంఎం వాన కురవగా,కోటవురట్ల మండలంలో రెండో స్థానంలో 38.6 ఎంఎం, మూడో స్థానంలో పాయకరావుపేటలో 35.8 మిల్లీ మీటర్ల వర్షం పడింది. పరవాడలో అత్యల్పంగా 1.4 మిల్లీ మీటర్ల వాన కురిసింది. జిల్లాలో సగటున 16.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా జిల్లాలో అన్ని మండలాల్లో వాన పడటం విశేషం. ఇటీవల కాలంలో తీవ్రంగా కాస్తున్న ఎండలతో అల్లాడిన జనానికి ఒక్కసారిగా ఉపశమనం లభించినట్లయింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లారింది.

కొండలను గుల్ల చేస్తున్నారు..

- రావాడలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- రేయింబవళ్లు కొనసాగుతున్న అక్రమ దందా
- పట్టించుకోని రెవెన్యూ, గనులశాఖ అధికారులు

ప్రొక్లెయినర్, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

పజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ గ్రామ రెవెన్యూ పరిధిలో.418 సర్వే నెంబరు భూమిలో గ్రావెల్స్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు రేయింబవళ్ళు దర్జాగా గ్రావెల్‌ను తవ్వి తరలించేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు పేరు చెప్పి అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే రావాడ రెవెన్యూ సర్వే నెం.418లో ప్రొక్లెయినర్లతో గ్రావెల్ తవ్వి, ట్రాక్టర్ల ద్వారా రావాడ, నునపర్తి, నడింపల్లి పరిసరప్రాంతాల్లోకి తరలిస్తున్నారు. ఇదే రావాడ రెవెన్యూలో గతంలో అప్పటి తహశీల్దార్ బి.వి.రాణి సర్వే నెంబరు.418లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రదేశానికి వెళ్లి ఒక ప్రొక్లయినర్, 20 భారీ లారీలను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఇప్పుడు అదే ప్రదేశంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ సంపదలు, కొండలు తరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి అక్రమ సంపాదనకు తెరలేపుతున్నారు. అయితే ఈ అక్రమ గ్రావెల్ దందా స్థానిక నాయకులు, అధికారుల అండదండలతో జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పట్టణంలోని గవరపాలెం నూకాంబిక దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా, వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి, పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి

భగీరథ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహర్షి భగిరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డిఆర్ఒ సత్యనారాయణ జ్యోతి వెలిగించి, మహర్షి భగిరథ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం భగీర చరిత్రను వక్తలు వివరించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమాధికారి రాజేశ్వరి, హాస్టల్ వార్డెన్ నారాయణ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దిలీప్‌కుమార్ జన్మదిన వేడుక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపిఐడబ్ల్యుఎ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వైసిపి నాయకులు ఆయనకు పూలదండ వేసి, శాలువాతో సత్కరించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- చోడవరం రూరల్: మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, చోడవరం మండల టిడిపి అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామంలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పెందుర్తి ఎమ్మెల్యే సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, పెందుర్తి నియోజకవర్గ వైసిపినేత గండి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సర్పంచ్ మామిడి శంకరరావు, వైస్ ఎంపిపి-2 మామిడి లక్ష్మి కొండాజీ, కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, బైలపూడి దేముడు బాబు, సింగంపల్లి శ్రీనివాసరావు, కర్రి కనకరాజు,గండి దుర్గాప్రసాద్, కాళ్ళ శ్రీను, ఎంపిటిసి రాపేటి అరుణ రాము, గొర్లి నూకరాజు, సబ్బవరం సర్పంచ్ ధెడ్డం ప్రసాద్ , తాసుబిల్లి కనకరాజు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేనాపతి దుర్గ అప్పారావు, వైసిపి నేతలు సిరపరపు వాసు , బత్తిన వెంకట్ పాల్గొన్నారు.

రేపు బుచ్చయ్యపేట మండల సమావేశం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంల ఈ నెల 6 న మంగళవారం ఉదయం జరుగుతుందని ఎంపిడిఒవి. విజయలక్ష్మి తెలిపారు. ఎంపిపి దాకారపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసి లు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులు సత్ప్రవర్తన అలవరచుకోవాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : పిల్లలు చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, సత్ప్రవర్తన అలవరచుకోవాలని సత్యసాయి సేవా సంస్థల బాలవికాస్ ఇన్‌ఛార్జి ఎన్.శంకర్ సూచించారు. ఆదివారం మండలంలోని వాలాబు బాలవికాస్ కేంద్రంలో శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో రవిశంకర్. నూకరాజు, సన్యాసిరావు, జనార్థన్, వరలక్ష్మి, బాల వికాస్ చిన్నారులు పాల్గొన్నారు.

సిఐకి అభినందన

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక పోలీస్ స్టేషన్ సిఐగా కొత్తగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును తెలుగు యువత అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐకి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, పొట్ల కృష్ణ పాల్గొన్నారు.

టిడిపి స్థలం లీజు రద్దు చేయాలి

- ప్రభుత్వ కార్యాలయాలను విస్మరించడం దుర్మార్గం
- అధికార పార్టీలపై అధికారుల స్వామి భక్తి : సిపిఎం ధ్వజం

మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు, భవనాలను లేకపోయినా, పార్టీ కార్యాలయాలకు స్థలాల కేటాయిస్తూ అనకాపల్లి జిల్లాలోని అధికారులు స్వామి భక్తిని చూపిస్తున్నారని .సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి. ఉమామహేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్యబాబు, కనకల్ల అప్పలరాజు విమర్శించారు.అనకాపల్లి మండలం కొత్తూరు రెవిన్యూ సర్వేనెంబర్ 608/10లో రూ.20 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని సంవత్సరానికి రూ. 2 వేలు చొప్పున 36ఏళ్లకు తెలుగుదేశం కార్యాలయానికి లీజుకు ఇవ్వడాన్ని పార్టీ అనకాపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించారు. ఈ లీజును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రం అయినప్పటికీ కలెక్టరేట్, జిల్లా పోలీసు, జిల్లా కోర్టు, రిజిస్ట్రార్ ఆఫీస్, వివిధ సంక్షేమశాఖాధికారుల కార్యాలయాలతోపాటు పలు ప్రభుత్వశాఖలకు జిల్లా స్థాయి కార్యాలయాలు నిర్మించుకోవడానికి ఎటువంటి ప్రభుత్వం స్థలం కేటాయించని జిల్లా అధికారులు, టిడిపి కార్యాలయానికి ఆగమేఘాల మీద కొత్తూరు రెవెన్యూలో రూ.20 కోట్ల ప్రభుత్వ భూమిని కారు చౌకగా కట్టబెట్టడాన్ని ఆక్షేపించారు.

గతంలో వైసిపి ప్రభుత్వం ఇటువంటి పద్ధతి అవలంబించినపుడు తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి పార్టీలు, ఇపుడు అదే పని చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన పాలకులు, రాజకీయ పార్టీల పేరుతో విలువైన స్థలాలను కాజేయాలని చూడటం దుర్మార్గమ న్నారు. టిడిపికి భూకేటాయింపులు లీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విధానం కొనసాగితే ఎక్కడా ప్రభుత్వ స్థలాలే లేకుండాపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు రెండు, మూడు సెంట్లు నివాస స్థలం ఇవ్వడానికి చేతులు రాని ప్రభుత్వం, తమ సొంత పార్టీలకు అప్పనంగా ప్రభుత్వ భూములు కట్టబెట్టడం శోచనీయ మన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలు గడిచినా సూపర్ సిక్స్, ఇతర పథకాలను అమలు చేయలేదన్నారు. ఇటువంటి వ్యక్తిగత, పార్టీ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ భూములను కాజేస్తే ప్రజల్లో పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

పరాయిపంచన ప్రభుత్వ కార్యాలయాలు కానరావా? : సిపిఎం నేత వెంకన్న

దేవరాపల్లి : జిల్లా కలెక్టర్ కార్యాలయమే అద్దె భవనంలో నడుస్తుంటే అధికార పార్టీ సొంత భవనానికి జిల్లా కలెక్టర్ స్థలం కేటాయించడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో , అనకాపల్లి కొత్త జిల్లాగా ఆవిర్భవించి, నాలుగేళ్ల వుతున్నా, జిల్లా కేంద్రంలో ఏ ఒక్క కార్యాలయానికి సొంత భవనం లేకపోగా,వాటికి స్థలాలను కేటాయించలేదన్నారు.

ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలకుఅవసరమైన స్థలాలను కేటాయించాలని, తర్వాత ప్రజల అవసరాలను ప్రాధాన్యతనిచ్చి, ఇంకా మిగిలి ఉంటే ఇతరులకు కేటాయించొచ్చన్నారు. అలా కాకుండా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రూ.20కోట్ల విలువైన భూమిని ఏడాదికి రూ.రెండు వేలు కారుచౌక లీజ్‌కు కాజేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఇలాగే చేసిందని అప్పట్లో ఆందోళన చేసిన వారు, ఇపుడు అదేబాటలో వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సొంత లాభాలు మానుకుని ప్రజల కోసం రాజకీయపార్టీలు పనిచేయాలని, లేకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

భూరికార్డులపై కొరవడిన అజమాయిషీ

- జమాబందీ లేక అక్రమాలకు తెరదీత
- ఆన్‌లైన్‌లో రికార్డుల తారుమారుకు ఛాన్స్
- అసలు యజమానులకు కొత్త కష్టాలు

అనకాపల్లిలోని సాగుభూమి

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : భూరికార్డుల నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగంతో ప్రయోజనాలతోపాటు కొత్త కష్టాలు, సమస్యలూ వచ్చి పడుతున్నాయి. వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఉండడంతో ఆధునిక కాలంలో భూమికి రక్షణ ఉందా అంటే ప్రశ్నార్థకమే. భూమి అసలు యజమాని ఎవరు? ఎవరి అజమాయిషీలో ఉందో తెలుసుకోవడం కష్టతరంగా మారింది.దీంతో టెక్నాలజీతో రైతులకు, భూయజమానులకు రక్షణగా నిలవాల్సిన పరిజ్ఞానం, అనేక ఇబ్బందులనూ తెచ్చిపెడుతోంది. భూ యాజమాన్యం ఇష్టానుసారంగా మారిపోవడంతోపాటు ఎక్కడికక్కడే ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. అసలు యజమానికి తెలియకుండానే భూరిజిస్ట్రేషన్లు అయిపోతున్నాయి. ప్రభుత్వ ఉదాసీనత అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికన్నా పాతకాలంలోనే భూమికి రక్షణ ఉండేది. ప్రభుత్వ పర్యవేక్షణ పక్కాగా ఉండడంతో పాటు ప్రతిఒక్కరి భూమికీ ఒక లెక్క ఉండేది. తదుపరి ఆయా భూములపై సంబంధిత యజమానుల అజమాయిషి ఉండేది. దీనికి కారణం జమాబందీయే.

జమాబందీతో భూరికార్డుల్లో పారదర్శకత

ఏడాదికి ఒకసారి క్షేత్రస్థాయిలో విఆర్‌ఒలు పక్కాగా జమాబందీ నిర్వహించేవారు. రికార్డులో ఏ భూమి, ఎవరి పేరున ఉన్నది. ఆయా భూముల్లో ఏయే పంటలను ఎంత విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు, ఎంత పన్ను వేశారు ఇలా వివరాలన్నీ పూర్తి లెక్కలతో రికార్డులో నమోదు చేసేవారు. వాటిపై ఎంఆర్‌ఐలు, తహశీల్దార్లు పర్యవేక్షణలు కొనసాగేవి. దానిపై ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్ ఇలా ఉన్నతస్థాయి అధికారులు ఆయా కార్యాలయాలకు వచ్చి, రికార్డులు పరిశీలించి జమా ఖర్చులను చూసేవారు. దీంతో ఏటా రికార్డు అప్‌డేట్ కావడంతోపాటు ఏదైనా తేడా జరిగితే, అధికారులతోపాటు భూయజమానులకు వెనువెంటనే తెలిసిపోవడంతో వాటిని చక్కదిద్దుకునే వీలుండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కనబడడం లేదు. దీంతో భూరికార్డుల్లో యజమాని ఎవరో తెలుసుకోలేని పరిస్థితి నెలకొనడంతోపాటు, అడ్డగోలుగా రికార్డుల్లో చేర్పులు మార్పులకు ఆస్కారం ఏర్పడింది. దీంతో తెలుసుకోగలిగితే అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి సరిదిద్దుకోవడంతో, లేకుంటే సమస్యలను కొనితెచ్చుకునే పరిస్థితి ఉత్పన్నమౌతోంది.

రీసర్వే తర్వాత మరింత గందరగోళం

2014లో అప్పటి ప్రభుత్వం భూరికార్డుల ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. రికార్డులు ఆన్‌లైన్ చేయాలనే సంకల్పం మంచిదే అయినా, నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంతో అసలు లక్ష్యానికే మోసం రావడంతోపాటు నీరుగారిందనేది విశ్లేషకుల మాట. ఆన్‌లైన్‌లో భూయజమాని ఎవరు, సాగుదారుడెవరో తెలియని పరిస్థితి. ఆన్‌లైన్ రికార్డులో ఒకలా ఉంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనేక చోట్ల భిన్నంగా ఉంటున్నాయనే అభిప్రాయమూ వ్యక్తమౌతోంది. కాస్తా మేనేజ్ చేసుకోగలిగితే, ఆన్‌లైన్‌లో ఓనర్‌షిప్‌ను మార్చుకుని, ఇంకొకరు పేరుతో రిజిస్టర్ చేసుకునేందుకు ఆస్కారమేర్పడుతోంది. దీంతో నిజమైన భూయజమాని నష్టపోవడమేకాక, ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటోంది. ఇటీవల జరిగిన రీ సర్వేతో భూరికార్డుల్లో మరింత గందరగోళ పరిస్థితి నెలకొని, వ్యవస్థ మొత్తం పట్టుకోల్పోయే పరిస్థితి ఉత్పన్నమైందని నిపుణుల భావన.

జవాబుదారీతనం లేదు

ఆన్‌లైన్ ప్రక్రియతో భూమిపై జవాబుదారీతనం లేదు. టెక్నాలజీ పెరుగుతున్న కొలదీ ప్రజలకు రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు, అనేక సందర్భాల్లో సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. విలువైన భూమిని కూడా అమాయకులు నష్టపోతున్నారు.

- గంటా శ్రీరామ్,
సిపిఎం మండల కన్వీనర్

కొరవడిన అజమాయిషీ

భూములకు సంబంధించి జమాఖర్చులకు ఏటా రెవిన్యూ యంత్రాంగం రికార్డుల్లో నమోదు చేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ పేరిట అవన్నీ కనుమరుగై పోయాయి. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు పేదల భూమికి రక్షణ కల్పించలేకపోతున్నాయి.

- ఎం అప్పలరాజు,
జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

వర్షంలోనూ సిహెచ్‌ఒల నిరసన

వర్షంలో నిరసన నినాదాలు చేస్తున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి -.అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్యమిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఒ)ల ఆదివారం వర్షంలోనూ నిరసన కొనసాగించారు. . స్థానిక నెహ్రూ జంక్షన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా నిరసన శిబిరంలో ప్రతినిధులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ఏటా ఐదుశాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఇపిఎఫ్‌ఒ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుండి సిహెచ్‌ఒలను మినహాయించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గతనెల 28 నుంచి నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు పాల్గొన్నారు కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి, ఎపి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి.శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. సిహెచ్‌ఒలు జి భవాని, పి రేవతి, జి యమున, కె అశ్విని, టి కల్యాణి, బి.సుధాకర్, ఆర్.అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సిహెచ్ స్వామి పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం

▸▸ నేల రాలిన సపోటా, మామిడికాయలు ▸▸ కూలిన చెట్లు ▸▸ లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని శనివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం బీభత్సం సృష్టించడంతో పలువురు రైతులకు అపార నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మామిడికాయలు నేల రాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది మామిడి కాయలు దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. కనీసం పెట్టుబడులు రాని పరిస్థితిలో మామిడి రైతులు, కౌలు రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇటువంటి సమయంలో మునిగే నక్క పై తాటి పండు పడినట్లు ఈదురు గాలులతో వర్షం బీభత్సం సృష్టించడంతో కాసిన

నేలకొరిగిన మామిడి, సపోటా చెట్లు

నేల రాలిన మామిడి

మామిడి కాయలు నేల రాలడంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. రాలిన మామిడికాయలు ఎందుకు పనికి రావని, అకాల వర్షం తీవ్ర నష్టం మిగిల్చిందని పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఉపమాకలో మామిడికాయలు నేల రాలడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతు ప్రగడ అప్పారావు ఆవేదన వెలిబుచ్చారు. ఈదురు గాలులకు సపోటా చెట్లు విరిగిపోయి, నేలకొరిగిపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతు కొంకిపూడి జోగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో అరటి, కొబ్బరి చెట్లు కూడా విరిగి పోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, నేల కొరిగి పోవడంతో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా పనులు చేపట్టి విద్యుత్ లైన్లు సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా మోస్తారు వర్షం కురిసింది.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ, నియోజకవర్గం నాలుగు మండలాల్లోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా సమాచారాన్ని సేకరించారు. ప్రస్తుతానికి ఏ పనులు కొనసాగుతున్నాయి ఎంత వరకు పూర్తయ్యాయి తదితర అంశాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రోడ్లు, స్మశానాల అభివృద్ధి, డ్రైనేజ్ ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గత వారం రోజులుగా ముఖ్య రహదారులకు అనుసంధా నంగా గ్రామ రహదారుల అభివృద్ధికి నాబార్డ్ నిధులు నుండి 12 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఈ పనుల నాణ్యతపై రాజీపడకుండా, ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నాణ్యతను పాటించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సుకల రమణమ్మ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక: పెదగంట్యాడ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. కథలు చెప్పారు. కలర్ పేపర్లతో క్రాఫ్ట్ చేయించారు. గ్రంథాలయాధికారి పి.వి.రమణ పాల్గొన్నారు .

ములగాడ : మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. పిసినారి, రేచీకటి అల్లుడు తదితర కథలను చదివి వినిపించారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా హాస్య కథలను, జోక్సను చిన్నారులు చెప్పారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను చదివి ఇండియన్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించిన జి.సంధ్యను సత్కరించారు. సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని బాలలు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఐఏఎస్.భాగ్యలక్ష్మి భాగ్యలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతి కథలు చదివించడంతోపాటు వాటిపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ ఎం పద్మావతి ఆధ్వర్యంలో బాటిల్స్ గేమ్ నిర్వహించారు.

కోటవురట్లలో చదువుతున్న విద్యార్థి

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా ఆదివారం పుస్తక పఠనం, కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. నర్సింగిబిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి ప్రతిరోజు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు, ఇంగ్లీష్ పదాలు, గ్రామర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జగన్ విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతి కథల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో కథలను చదివించి, నీతిని బోధించారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు.

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు అప్పలనాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు తెలుగు పాటలు, పద్యాల పట్ల మక్కువ చూపాలని, మాతృభాషపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బుక్ రీడింగ్ నిర్వహించారు.

నర్సీపట్నం టౌన్ :వ్యాయామంతో శారీరక, మానసిక ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని వ్యాయామ విశ్రాంత ఉపాధ్యాయులు పి ప్రభాకర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే, ఒత్తిడి తగ్గుతుందని నిద్ర బాగా పడుతుందన్నారు. రిసోర్స్ పర్సన్ ప్రసాద్ తెలుగు బాష ప్రత్యేకతను వివరించారు. పిల్లలను తల్లిదండ్రులు గ్రంథాలయానికి పంపించాలని గ్రంథాలయ అధికారిని దమయంతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

14న అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను సంఘం శరణం గచ్ఛామి పేరుతో నాటకాన్ని ఈనెల 14వ తేదీన స్థానిక సిటీ క్లబ్ ఆవరణలో ప్రదర్శించుతున్నట్లు కెవిపిఎస్ తెలిపింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టయ్య మాస్టారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాటక ప్రదర్శనను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు కరపత్రాలు విడుదల చేశారు. అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకం సిటీ క్లబ్ లో సాయంత్రం ఐదు గంటలకు ఉంటుందని తెలిపారు.కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, సామాజిక చైతన్య సంస్కృత ఉత్సవాలు మే చివరి వరకు అన్ని జిల్లాల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మిషన్ సంఘం నాయకులు మల్లేష్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కే త్రిమూర్తులు రెడ్డి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వేసవి సెలవుల్లో విద్యార్థిని విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ పై శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు ఆది వారం విలేకరులకు తెలిపారు.ఆర్పి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ లు స్థానిక శారద నగర్ 2వ లైన్ నెక్స్ స్టోర్స్ లో ప్రారంభమయ్యాయి. కరాటే, కొబుడో, కిక్ బాక్సింగ్, ఆర్ట్ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్, వెయిట్ గైన్, ఫిట్నెస్ వంటి వాటిలో శిక్షణ ఇస్తామన్నారు. వీటితో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఒత్తిడి తగ్గుతుందని, మానసిక శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా పోషకాహారాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రోడ్డు పక్కన వేసిన చెత్తాచెదారం

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయరూ...

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్తను తరలించేందుకు పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చెత్తను తరలించేందుకు గ్రీన్ అంబాసిడర్లు, ట్రాక్టర్, ఒక డ్రైవర్ కూడా ఉన్నారు. ప్రతిరోజు వివిధ కాలనీలు, వీధుల్లో సేకరించిన చెత్తను గతంలో తహసిల్దార్ కార్యాలయం, హై స్కూల్ ప్రహరీ తులసి కళ్యాణ మండపం వద్ద పోగులుగా పోగులుగా వేసేవారు. దీంతో, ప్రజలు దీంతో మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు, గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. డంపింగ్ యార్డ్ స్థలం కోసం ఇటీవల పంచాయతీ సిబ్బంది తహసిల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గ్రామ పొలిమేరలో ప్రభుత్వ స్థలం కేటాయించడంతో ఆ స్థలంలోనికి కొంతకాలం చెత్తను తరలించారు. ఇక్కడ కూడా అభ్యంతరం వ్యక్తం కావడంతో సేకరించిన చెత్తను ఎక్కడ పోయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో, పంచాయతీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

స్పీకర్‌ను సత్కరిస్తున్న ఛైర్మన్ తాతారావు

స్పీకర్‌ను కలిసిన డిసిసిబి ఛైర్మన్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు, గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ కోన తాతారావు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, కోన తాతారావుకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని సహకార చట్టాలపై లోతైన అవగాహన కలిగి ఉన్నారని ప్రశంసించారు. ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించడం రైతాంగానికి, బ్యాంకు అభివృద్ధికి శుభ సూచకమన్నారు.

గూడుపమ్మ క్షేత్రంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

శిథిలమైన పాఠశాల భవనం

ప్రమాదకరంగా..
పాఠశాల శిథిల భవనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శిథిల తరగతి గదులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తగా భవనాలు నిర్మించారు. అయితే ప్రస్తుతం నిర్మించిన తరగతి గదుల సమీపంలోనే పాత తరగతి గదులు శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. శిథిల తరగతి గదుల సమీపమునుంచే విద్యార్థులు అప్పుడప్పుడు రాకపోకలు సాగిస్తున్నారు. విష సర్పాలు సైతం సంచరిస్తూ ఉండటంతో ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.సంబంధిత అధికారులు ఇప్పకైనా స్పందించి శిథిల భవనాలను తొలగించాలని కోరుతున్నారు.

కూలుతున్న గోడలు

నాడూ, నేడూ గోతులే...

ఎన్నాళ్లీ వెతలు!

- కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలైనా మారని రహదారుల దుస్థితి
- అడుగుకో గొయ్యి, అవస్థలు పడుతున్న వాహనదారులు

బంగారుమెట్ట కూడలిలో నిలిచిన వర్షపు నీరు

వడ్డాది జంక్షన్‌లో రోడ్డు గోతిని దాటుకుంటూ వెళుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:
అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్లన్నీ పూర్తి చేస్తాం... మరమ్మత్తులు చేపడతాం...ఇది గత ఎన్నికల్లో అధికార కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు.. కానీ అధికారాన్ని చేపట్టి పది నెలలు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదన్నట్టుగా రోడ్ల పరిస్థితి ఉంది. ముఖ్యంగా భీమునిపట్నం-నర్సీపట్నం (బిఎన్) రోడ్డు ప్రయాణికుల పాలిట నరకప్రాయంగా మారింది. రావికమతం నుండి చోడవరం వరకు అడుగుకో గొయ్యి ఏర్పడింది. ఏమాత్రం వర్షం కురిసినా గోతులలో నీరు నిల్వచేరి చెరువులను తలపిస్తున్నాయి. పొట్టిదొరపాలెం, ఎల్.సింగవరం, బంగారు మెట్ట, వడ్డాది, విజయరామరాజుపేట, లక్ష్మీపురంల వద్ద రోడ్డు దారుణంగా ఉంది. వర్షం కురిసినప్పుడు నీరు నిల్వ చేరడంతో వాహనదారులు గోతులు అంచనా తెలియక పట్టు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుందని వా ప ా న చో ద కు లు వాపోతున్నారు. కూలిన వడ్డాది, విజయరామ రాజుపేట వంతెనలు వద్ద డైవర్షన్ రోడ్లలో వాహనచోదకులకి ప్రత్యక్ష నరకం కనిపిస్తుంది. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బిఎన్ రోడ్డు అధ్వాన్న స్థితికి చేరింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా బిఎన్ రోడ్డు కనీసం మరమ్మత్తులకు నోచుకోలేదు. ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్డు పూర్తి చేస్తామన్న కూటమి ప్రభుత్వ పెద్దల హామీలు అమలుకు నోచుకోక పోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సీజన్ పూర్తయితే వర్షాకాలంలో రోడ్డు మరమ్మత్తులు చేపట్టడం మరింత ఆలస్యం అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు బిఎన్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎల్ సింగవరం వద్ద గొయ్యి

బేంబేలు ఎత్తుతున్న వాహనదారులు

రావికమతం నుండి చోడవరం వరకు ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడిపోతున్నారు. అడుగుకో గొయ్యి... అన్న చందంగా ఈ రోడ్డు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిస్థితి ఈ ప్రభుత్వ హయాంలో కూడా కొనసాగుతుండడంతో వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కూడా నరకంగా ఉంది. బస్సులు గోతుల్లో దిగి తేల్చి పడేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేటి డిడిఆర్‌సి లోనైనా చర్చిస్తారా?

నేడు అనకాపల్లి జిల్లా సమీక్ష సమావేశం లోనైనా ఈ బి -ఎన్ రోడ్డు దుస్థితి పై చర్చించాలని, నిధులు మంజూరు చేసి పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకునికి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కశింకోట : మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ ఘటనలపై జిల్లాలోని శక్తిటీమ్‌లు వేగంగా స్పందిస్తున్నాయి. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిపస్తూ, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో డిఎస్‌పి ఎం.శ్రావణి పర్యవేక్షణలో ఏర్పాటైన శక్తి టీమ్‌లు తగు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా తాళ్ళపాలెం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదుపై శక్తి టీమ్, నిందారోపితుడిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు.
కశింకోట మండలం, తేగాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తరచూ తనను ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడన్న విద్యార్థిని ఫిర్యాదుపై శక్తి టీమ్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ పి.మనోజ్ కుమార్ నేతృత్వంలో హెచ్‌సి మల్లీశ్వరి, పిసిలు దీపిక, కొండలరావు, అప్పలాచార్య, నాయుడు ఇతర పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, సంబంధిత వ్యక్తినిఅదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టపరంగా శిక్షలుపై అతని వివరించి, భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎదురయ్యే తీవ్ర పరిణామాలపై హెచ్చరించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మనోజ్ కుమార్

95 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు ప్రారంభించారు. 95 మంది కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 12మందికి కంటి ఆపరేషన్లు, 39 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. 44 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాపేటి అరుణ రాము, మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్యప్రకాశరావు, సి.హెచ్. దేవి, అప్పలరాజు, డాక్టర్ షణ్ముఖ్, డాక్టర్ రమేష్, వి.మణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి వైద్య నిపుణులుగా వాసవి

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ఏరియా ఆసుపత్రిలో శాశ్వత ప్రసూతి వైద్య నిపుణులుగా సబ్బవరపు వాసవి నియమితులయ్యారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి గర్భిణీకి సుఖప్రసవం అందించేందుకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు.. గర్భిణీ స్త్రీలతోపాటు ఇతర మహిళలు ఆరోగ్య సమస్యలు ఆసుపత్రికి వచ్చి తెలియజేస్తే తగిన వైద్య సేవలు అందిస్తామని ఆమె చెప్పారు. ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు సదుపాయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అడపవలసలో లారీ బోల్తా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అడప వలసలోని ఆంధ్ర, ఒడిశా ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారు జామున చేపల లోడుతో వెళు తున్న లారీ బోల్తా పడింది. ఆంధ్ర నుంచి ఒడిశాలోని జైపూర్‌లో చేపల లోడుతో వెళ్తున్న లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడి ప్రమాదం నుంచి గట్టెక్కారు. లారీ బోల్తా పడటంతో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ ఏర్పడింది. ఎక్కడికక్కడే వాహనాలు నిలిచి పోయాయి. స్థానికుల సాయంతో ట్రాక్టర్‌తో లారీని పక్కన పెట్టడంతో నిలిచిన వాహనాలు రాకపోకలు సాగించాయి.దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.